

# చిమ్నీ

## జి.నరసింహమూర్తి

జేరేసి ఉన్న తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి హోరుగాలికి. అప్పుడే వెలిగించిన లైటు ఆరిపోయింది.

ఆరిపోకేమౌతుంది?

చిమ్నీ లేని లైటు!

ఆ హరికెన్ చిమ్నీ కొనాలని యెప్పట్నుంచో అనుకుంటుంది మార్తమ్మ. కాని కుదర్లేదు.

"పిల్లా! వెళ్ళి తలుపు యేసిరావే." అని కూతురికి చెప్పి మళ్ళీ అగ్గిపుల్ల గీయడానికి సిద్ధమయింది.

ఏడేళ్ళ కూతురు ఆ మాట వినిపించు కోకుండా అక్కడే కూర్చునుంది.

"నిన్నే - వెళ్ళి తలుపేసి రమ్మంటం లేదూ?" అంది కాస్త గద్దింపుగా.

"నాకు భయం" అంటూ కూతురు కూర్చున్నకాడే ముడుచుకుపోయింది.

ఇక తనకు తప్పదు. తలుపులు మూసివద్దామని లేవబోయింది మార్తమ్మ.

అప్పటికే ద్వారబంధాన్ని పట్టుకుని రంగనాయకులు నిలబడి ఉండటం చూసి మార్తమ్మ ఉలిక్కిపడింది. గడపమీద ఎలుగుబంటు కూర్చున్నట్టు కంగారు పడింది. అయినా తన భయాన్ని బయటకు కనబడనీయకుండా——

"చీకటి మాపేళ యిలా వొచ్చావే?" అడిగింది.

"వర్షం వొచ్చేలా ఉంటే...." నసుగుతున్నాడు.

గుప్పున కాపుసారా వాసనకొట్టింది.

"ఇంకా వర్షం మొదలవ్వలేదుగా - వెళ్ళిపోకూడదూ."

గుడ్లగూబలా చూస్తూ "ఇక్కడుంటే యేమన్నా కొంపలంటుకుంటాయా?" నత్తి నత్తిగా పట్టి పట్టి అంటున్నాడు.

"కాకపోతే యేంటి? - మొగాడులేని యిల్లు కదా, యిలా నువ్వు యిక్కడికి రావడం చూస్తే అంతా యేమనుకుంటారు?"

"అందుకనేగా వొస్తా" అంటూ లోనకొచ్చేశాడు.

మార్తమ్మకి వొళ్ళు మండింది. అవతలకి గెంటి తలుపులు మూసుకోవాలనుకుంది. కాని అది సమయం కాదు. తాగినోడు ఏ దురాగతంచేసినా చేస్తాడు. తాగుడు అటువంటిది. ఎలాగైనా రంగనాయకుల్ని అక్కన్నుంచి బయటకు పంపించేయాలని చూస్తుంది మార్తమ్మ.

అక్కడున్న అగ్గిపెట్టె తీసుకొని ఎలాగైతే ఓ అగ్గిపుల్ల గీసి బీడీ వెలిగించాడు. తన స్వంత యిల్లులాగే ప్రవర్తించడం వరకూ వస్తూంది వ్యవహారం చూస్తూంటే —

సందెచీకట్లు అంతకంతకూ ఎక్కువై పోతున్నాయి. ఇళ్ళంతా చీకటి అలుముకుంటుంది.

మార్తమ్మ ముల్లుమీద నిలబడినట్టు బాధపడుతుంది.

"హోరుగాలేగాని వర్షం యిప్పుడెక్కడొస్తాది - వెళ్ళిరా అన్నయ్యా" అంది, రంగనాయకుల్ని ఇక మంచిగా ఎలాగో వదిలించుకోవాలని.

అన్నయ్యా అనటంతో రంగనాయకులకి నెత్తిమీద బాదినట్టయింది అంత మత్తులోనూ.

'దీని సిగదరగా....' అంటూ లోలోన ఏవేవో తిట్టుకున్నాడు.

వర్షం వస్తే అక్కడే మఠమెయ్యా లనుకుంటున్న రంగనాయకులు చచ్చి పోయాడు మారుమాటాడలేదు.

మా ర్తమ్మ చీకట్లో అలా మగవాన్ని పెట్టుకుని కూర్చుంటే బాగుండదని అగ్గి పుల్ల గీసి లైటు వెలిగించింది కాని అది మళ్ళీ ఆరిపోయింది.

తలుపులు బార్లా తీసిఉన్నాయి. మూయమనలేదు. పరాయి మనిషిని యింట్లో పెట్టుకుని తలుపులెలా మూస్తాది! రంగనాయకులు మీద కెక్కడ వస్తాడోనన్న భయం!

చేట అడ్డంపెట్టి ఎలాగైతే మళ్లీ లైటు వెలిగించింది. కాని మళ్ళీ అదే అయ్యింది.

అంతా ఓరకంట గమనిస్తూన్న రంగనాయకులు,

"చిమ్నీ లేకపోతే ఆరిపోకేంచేస్తాది" అన్నాడు.

అవును. అందులోనూ అర్థం ఉంది. లైట్లో నూనె ఉంది. వత్తి ఉంది. కాని చిమ్నీ లేకపోతే ఏదోగాలి ఆర్పివేస్తూనే వుంటుంది

అలాగే ఆలోచించింది కాస్సేపు. అయితే ఏంచెయ్యాలి తనది చిమ్నీలేని బతుకు, కొప్పులేని కొంప. అందరి కళ్ళూ తనమీదే ఉంటాయి. మొగదిక్కు లేని బతుకు కనక అంతా తననే వెంటా డుతూ వస్తున్నారు. కొందరు కొత్త అర్థాలొచ్చేలా మాట్లాడతారు. మరి కొందరు లొంగదీసుకోవాలని చూస్తుం టారు. కొందరు అదీ ఇదీ ఆశ పెడతానికి ప్రయత్నిస్తుంటారు. అడ్డమైనవాడూ అంత అసహ్యంగా అలా మాట్లాడు తుంటే ఎవరూ అదేమని అనరు.

ఎందుకని? మొగుడు వదిలేసిన మనిషి కనుక.

మొగుడు!

ఎంత దుర్మార్గుడు. అతని బుద్ధి మొదట్లో తనకేం తెలుసు? మొదటి పెళ్ళాంతో సంబంధాలు లేవని తనని పెళ్లాడి యిద్దరు పిల్లలు కలిగిన తర్వాత మళ్ళీ మొదటిదాన్నే తెచ్చుకుని తనని యింట్లోంచి తోలేశాడు. ఇదేం న్యాయం అన్న మనిషి ఒకడూ కనిపించలేదు. 'అవసరం తీరిపోవడంతో విసిరి పారేయ వలసి వచ్చిందా?' అన్న పెద్దమనిషి లేకపోయాడు. ఆడది నేసరికి న్యాయాని క్కూడా కళ్ళు మూసుకుపోతాయి కాబోలు మరి!

అప్పట్నుంచీ యిద్దరి ఆడపిల్లల్నీ పెంచుకుంటూ అక్కడక్కడా పని పాటలు చేసుకుంటూ బతుకుతూ వస్తుంది

పెద్దపిల్లని ఆ మిషనరీలో చేర్పిం చింది కనుక తనమీద కొంత భారం తగ్గిందిగాని లేకపోతే ఎవరు తనకు దిక్కు!

ఇంట్లోకి రయ్యిన గాలి మధ్య మధ్య దూసుకొస్తూనే ఉంది. కూతుర్ని ఒళ్లో

పడుకోబెట్టుకుని అలాగే అక్కడే కూర్చుండిపోయింది మార్తమ్మ పర ధ్యానంగా -

రంగనాయకులుకి ఆడవాళన గిలే కొలదీ బుర్ర గిరగతిరిగినట్టుంది. మార్తమ్మని చీకట్లో గుచ్చి గుచ్చి చూస్తున్నాడు ఒడేసి నమిలేయాలన్నట్టు. కాని మార్తమ్మ వొళ్లో పిల్ల బొమ్మ జెండులా కనిపిస్తోంది తన కోరికల కడుపులోకి కత్తులు దిగబడ్డాయి. ఏదో మార్గం వెదకాలనుకున్నాడు.

"యేంటే అలా ఆలోసిత్తావు ?"

"అబ్బే యేంలేదు అన్నయ్యా - ఇంటిదగ్గర వాదినా పిల్లలూ బాగున్నారా ?"

రంగనాయకులి ముఖంమీద సలసల కాగే నూనె పోసినట్టయింది

అతని ప్లాను పేరు.

మార్తమ్మకి ఆ సమయంలో రంగ నాయకుల్ని వదిలించుకోడానికి అంత కంటే వేరే మార్గం కనిపించడంలేదు.

తాను ఎందర్ని తన తోబుట్టువులా చూడడంలేదు ? వాళ్ళు మాత్రం పాడు మాటల్తో తనని గాయపరుస్తున్నారు. యెందర్ని యెదిరించగలదు - వాళ్ళ యేడుపేదో వాళ్ళే యేడుస్తారేలేనని తల కుంచుకుపోతూంది. కాని ఒక్క రోజా రెండురోజులా ? నాలుగు సంవత్సరాల నుంచి లోకం తనని పొడుచుకుతింటోంది. తననెలాగైనా తప్పించుకొనేందుకు చాలని ప్రయత్నం చేస్తోంది.

"అమ్మా, ఆకలేస్తుందే" అంటూ పిల్ల యేడుపు ప్రారంభించింది ఏవేవో దొంగ ప్లానుల్లో మునిగిపోయిన రంగ నాయకులకి ఆ యేడుపు చాలా చీదరింపుగా తయారయ్యింది ఏవేవో కమ్మగా మాట్లాడాలని గుండెలు ఊగిసలాడు తున్నాయి కాని పిల్ల ఆకలి యేడుపు తన ఆశల్ని కుమ్మిపొడుస్తున్నట్టే ఉంది. ఆ పిల్లకాయ గొంతుమీద కాలేసి నొక్కిపట్టి, చంపి రెక్క పుచ్చుకుని అవతల కెక్కడికో గిరాటెయ్యాలనిపిం చింది. ఉడికిపోయాడు.

"అన్నయ్యా ! పిల్లకి కాసిని గంజి నీళ్ళు కాసి పోసుకుంటాను "

"అయితే నువ్వింకా కూడు తిన్లే దన్నమాట."

మార్తమ్మ మాట్లాడలేదు.

రంగనాయకులు కాస్సేపు అటూ యిటూ తచ్చాడాడు.

ఆకాశంమీద మెఱుపు తర్వాత ఉఱుము.

రంగనాయకులికి అయోమయంగా ఉంది. ఏమీ తోచక ధుమధుమ చూసి సణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

గబుక్కున వెళ్ళి తలుపు మూసుకో లేదు. అక్కడే నిర్జీవంగా కూర్చుండి పోయింది మార్తమ్మ.

త్రోవేపోయేవాడు పోక తనమీద యెంత అధికారం చూపించాలనుకుంటున్నాడు. ఇది ఒక్క రంగనాయకులే కాదు. ఊళ్ళో చాలామంది ఆ యింట్లో తమకేదో అధికారం ఉన్నట్టు వచ్చేస్తారు. అదేమంటే అక్రమానికి తలపడతారు. తనో ఆకు. తనది దిక్కులేని బతుకు. తలుపులేని ఇల్లు! తన పక్కనే చిమ్నీలేని హరికెన్ దిగాలుపడి ఉంది.

తనకూ ఆ హరికెన్‌కూ తేడాలేదు.

మార్తమ్మ ఓ నిట్టూర్పు విడిచింది. తన బతుకలా బండలపాలయిందని విచారిస్తూ వెళ్ళి తలుపు మూసింది. మళ్ళీ హరికెన్ వెలిగించింది. ఎక్కన్నుంచో వస్తున్న గాలికి అది రెపరెపలాడుతూనే ఉంది. దానిని ఆరిపోకుండా రక్షించుకోవడం మార్తమ్మకు చికాగ్గానే ఉంది యిపుడు. విసుగెత్తిపోయింది.

ఛీ- ఇక ఊరుకుంటే అంతే - దానికెలాగైనా చిమ్నీ వేయాలి. అపుడెంతో ప్రకాశంగా వెలుగుతాది. గర్వంగా అన్నిటికీ నిలబడి ఉంటుంది.

గూటికి చేరలేని ఓ కాకి ఆ చీకటివేళ ఒక్కర్తే రోదిస్తూ వెళ్ళిపోతోంది.

'నాది కూడా ఏకాకి బతుకు. దిక్కుమాలిన బతుకు' అనుకుంది మార్తమ్మ.

చీకటి బతుకును ఎంతకాలం పిండినా వెలుగు చుక్కలు రాల్తాయా!

కన్నీళ్ళొచ్చాయి. చాలా కాలం తర్వాత గుండెలు దుఃఖంతో పొంగాయి. అంత దుఃఖంలోనూ కాసిని గంజి పొంగించి కూతురు కట్టించింది.

తాను కాసుకున్నా గంజి తాగినా తాగకపోయినా అడిగే దిక్కులేదు. ఎప్పటికి ఏ గాలికి కొట్టుకుపోవాలో తెలియడంలేదు.

అవతలెక్కడో అదే పనిగా కుక్క మొరుగుతోంది.

మొండిగా బ్రతుక్కొస్తున్న మార్తమ్మ గుండెల్లో భయంలాటిదేదో గుచ్చుకుంది ఆవేళ. బతుకంటే అంత భయంగా ఉంటుందనీ, అంత భయపడాల్సి వస్తుందనీ యెన్నడూ అనుకోలేదు.

జీవితంలో నిజమైన అందాలేమిటో తెలిసొచ్చేసరికే యిద్దరి పిల్లల్ని కనేసింది. అంతటితో అన్నిటికీ దూరమై అలా బతుకుతుంది. వయస్సులో ఉంది. మనసు కానిపని చేసినా యే మాయ వలలో పడినా తనబతుకే కాదు. తన ఇద్దరి కూతుర్ల గతి రేపెంగాను? - వాళ్ళను యీ మనుష లెలా చూస్తారు? తన తప్పువల్ల వాళ్ళ బతుకు బజారున పడితే యింకేముంది? అటువంటి నరకంలోకి బంగారంలాటి బిడ్డల్ని తోసేస్తే యిక మనిషి జన్మ పెట్టుకు పుడుత అనవసరం కాదా?-

ఇవే ఆలోచనలు మార్తమ్మని వెంటాడుతున్నాయి

కూతురు పక్కనే పడుకొని నిద్రపోతూంది.

తన అందం యెలాటిదో తనకు తెలియదుగాని తన కూతురిని చూస్తుంటే అంత అందమైన కూన తన కడుపునెలా కలిగిందా అనిపిస్తుంది. మిషనరీలో చదువుకుంటున్న పెద్దపిల్ల కూడా అంద మైనదే!

వీళ్ళు లోకంలోకి ఎదిగొస్తున్నారు.

తానేమో ఏ దిక్కూ లేని ఆడది.

పెరుగుతున్న వీళ్ళని ఈలోకం ఎలా కబళించాలా, ఎప్పుడు కబళించాలా అని చూస్తూంటోంది.

అప్పటివరకూ యెందుకు? యిలాగే ఒకత్తే ఆ గుడిసెలో యెన్ని రోజులు తనను తను రక్షించుకోగలదు?

దుర్మార్గులు రాక్షసుల్లా చుట్టూ మాటేసిఉన్నారు. ఏ క్షణం ఎటువంటిదో!

నలుగురు మృగాలు చుట్టిముడితే వాళ్ల దంతాల మధ్య చిక్కడి పోవాల్సిందే!

బయట హోరుగాలి చూరులంట లోన కొస్తూంది. చిమ్నీలేని దీపం రెప రెప లాడుతోంది మరి దీపం యే భయమూ లేకుండా వెలగాలంటే దానికో చిమ్నీ కావాలి. మరి తనకూ?

ఇదే ప్రశ్న ఆమె అంతరంగంలో సుడి తిరిగింది.

సముద్రంలా పొంగింది.

అనేక సార్లు లెక్కచేయకుండా విదిలించేసిన మార్కెట్లో మేకమాంసం అమ్ముకుంటూ బతికే రెహమాన్ మాటలు మార్తమ్మకు అప్పుడే జ్ఞాపకం వచ్చాయి.

"మార్తమ్మా! మన మతాలతోటీ, కులాలతోటీ పట్టింపులు పెట్టుకోకు. మనసు ముఖ్యం. నేనొంటిగాణ్ణి. నువ్వు వొప్పుకుంటే నేను పెళ్ళాడుతాను. నీ యిద్దరి పిల్లల్నీ నా పిల్లల్లాగే చూసు కుంటాను—" అన్న మాటలు ఆమెను నిలువెల్లా చుట్టేసుకున్నాయి.

మార్తమ్మకు ఓ మార్గం కనిపించింది.

బయట హోరున వర్షం ప్రారంభ మైంది.

నిద్రపోతున్న తన కూతురికి నిండుగా దుప్పటి కప్పింది.

రెపరెపలాడే దీపంతోపాటు తన బతుకుకి కూడా ఓ చిమ్నీ తెచ్చుకోడానికి అంత రాత్రిలోనూ, అంత వానలోనూ రెహమాన్ యింటివేపు నడిచింది మార్తమ్మ.

